సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 25 । జూలై । 2025



సమస్యల స్వాగతం

దేవదాయ శాఖ మంత్రి నేడు జిల్లాకు రానున్నారు. ఆయనకు సమస్యలు స్వాగతం పలకనున్నాయి.

- 8లో



ముంపు బారిన పంట పొలాలు

సరుబుజ్జిలి: ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వస్తోంది. గురువారం బుడ్డివలస, తెలికిపెంట, పాతపాడు, అగ్రహారం, వీరమల్లిపేట గ్రామాల్లో పొలాలు ముంపు బారినపడ్డాయి.

'సేవలు, ధరలు రెండూ చెప్పండి'

అరసవల్లి: జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్స్, డయాగ్నస్టిక్ సెంటర్లు, ల్యాబుల్లో అందిస్తున్న సేవల వివరాలతో పాటు వాటి ధరలను కూడా ప్రజలకు కనిపించేలా డిస్‌ప్లే చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత ఆదేశించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ ఏపీ ప్రైవేటు మెడికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2002 ప్రకారం ప్రతి చోటా సేవల వివరాలు, ధరల వివరాలు తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో రోగుల ప్రయోజనార్థం రిసెప్షన్ కేంద్రాల వద్ద ప్రదర్శించాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

న్యూస్‌రీల్

'టీడీపీ కార్యకర్తలు చెప్పిన వారికే ఎరువులు'

టెక్కలి: టీడీపీ కార్యకర్తలు చెప్పిన వారికే ఎరువులు ఇస్తున్నారంటూ కోటబొమ్మాళి మండలం మాసాహెబ్‌పేట గ్రామ సచివాలయం వద్ద గురువారం రైతులు ఆందోళనకు దిగారు. పంచాయతీ పరిధిలో రైతుల కోసం సుమారు 800 బస్తాల యూరియా, 200 బస్తాలు డీఏపీ బస్తాలు వచ్చాయని అయితే అందరికీ సమానంగా ఎరువులు ఇవ్వకుండా టీడీపీ కార్యకర్తలు చెప్పిన వారికే ఇష్టానుసారంగా ఎరువులు పంచిపెట్టేశారని రైతులు నిలదీశారు. గతంలో ఇలాంటి పరిస్థితులు ఉండేవి కావని సమానంగా ఎరువులు అందజేసేవారని గుర్తు చేశారు.

కేవీకే శాస్త్రవేత్తకు అవార్డు



గవర్నర్ చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న కేవీకే శాస్త్రవేత్త బాలకృష్ణ

ఆమదాలవలస: ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ బాలకృష్ణకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. గురువారం కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు పొందిన డాక్టర్ సీహెచ్ బాలకృష్ణను కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మితో పాటు పలుశాఖలకు చెందిన శాస్త్రవేత్తలు అభినందించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బాలకృష్ణ ఈ అవార్డు అందుకున్నారు. ఆక్వా కల్చర్‌లో నూతన సాంకేతిక పద్ధతులను రైతులకు వివిధ విస్తరణ శిక్షణ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడం, చేపలు రొయ్యల సాగులో వచ్చే వ్యాధులను సకాలంలో గుర్తించి వాటి నివారణలో రైతులకు సహకార మత్స్య సహకార సంఘ సభ్యులకు అవగాహన కల్పించి పలు సూచనలు ఇచ్చేవారు. జిల్లాలో చేప పిల్లల పెంపకాన్ని ప్రోత్సహించి పరిశోధనలు, ప్రముఖ జర్నల్‌లో పరిశోధన పత్రాల సమర్పించారు. వీటన్నింటినీ పరిగణించి ఉత్తమ శాస్త్రవేత్తగా ఎంపిక చేశారని, ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు అందుకున్న బాలకృష్ణ వివరించారు.

'పోలీసుల ఏకపక్ష వైఖరి వల్లే ఆత్మహత్యాయత్నం'



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త శ్రీనును పరామర్శిస్తున్న చిరంజీవినాగ్

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి పోలీసుల ఏకపక్ష వైఖరి వల్ల రొట్టవలస గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ధనుకోట శ్రీను విసుగు చెంది గురువారం పురుగులు తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు పార్టీ యువ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్ తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కార్యకర్తను ఆయన పరామర్శించారు. శ్రీను అధికార పక్షానికి చెందిన ఓ వ్యక్తికి డబ్బు ఇవ్వాల్సి ఉందనే నెపంతో బలవంతంగా శ్రీనుకు చెందిన లగేజీ వ్యాన్‌ను అతడికి అప్పగించేశారని, ఈ వాహనాన్నే నమ్ముకుని బతుకుతున్న శ్రీను మనస్తాపం చెందిన పురుగు మందు తాగేశాడని తెలిపారు. తక్షణమే ఎస్పీ స్పందించి బాధితునికి న్యాయం చేయాలని కోరారు.

28న కుప్పిలి సంఘటనపై విచారణ

శ్రీకాకుళం: జిల్లాలో ఈ ఏడాది మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షల సందర్భంలో కుప్పిలిలో జరిగిన సంఘటనకు సంబంధించి విచారణను ఈనెల 28న చేపట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం డీజీ శ్రీనివాసులురెడ్డిని విచారణాధికారిగా నియమించింది. ఆరోజు మాస్ కాపీయింగ్ జరిగిందంటూ ప్రధానోపాధ్యాయున్ని, 13 మంది ఉపాధ్యాయులను, ఓ గుమస్తాను డీఈఓ తిరుమల చైతన్య సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో దీనిపై దుమారం చెలరేగగా ఉపాధ్యాయ సంఘాలు ముక్తకంఠంతో ఖండిస్తూ ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో అధికారులు సస్పెండ్ అయిన వారిని రీవోక్ చేసి విధులను కేటాయించారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు విచారణకు డిమాండ్ చేయగా తాత్సారం చేస్తూ వచ్చిన రాష్ట్ర స్థాయి అధికారులు తాజాగా విచారణను చేపట్టాలని నిర్ణయించి ఈనెల 28న 11గంటలకు జరిగే విచారణకు డీఈఓ తిరుమల చైతన్యతో పాటు సస్పెన్షన్‌కు గురైన వారంతా హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉంటే ఈనెల 30వ తేదీన డీఈఓ తిరుమల చైతన్య పదవీ విరమణ చేయనుండడం గమనార్హం.



రొయ్యకు తెల్ల రొట్ట..
రైతు నట్టేట..

- వనామీ రొయ్యకు వైట్‌గట్ వ్యాధి
- వాతావరణ మార్పులతో మరింత విజృంభణ
- ఆక్వా రైతులకు అదనపు ఖర్చుగా మారిన మహమ్మారి



వనామీ రొయ్యలు

పోలాకి:

జిల్లాలోని రొయ్యలు సాగు చేస్తున్న రైతులకు వైట్ గట్ అంటే తెల్ల రొట్ట వ్యాధి భయం పుట్టిస్తోంది. ముఖ్యంగా వనామీ రకంలో నెలరోజుల వయసు కలిగిన రొయ్యల్లో మేతమార్పిడి (చిన్న సైజు నుంచి పెద్ద సైజుకు) జరుగుతుంది. ఆ సమయంలో ఆహార సమతుల్యత లోపం వల్ల ఈ వ్యాధి వస్తుంది. సాధారణంగా గోధుమ నలుపుకు బదులుగా తెల్లటి లేదా అపారదర్శక మల పదార్థాన్ని విసర్జించడం ద్వారా ఈ వ్యాధిని రైతులు గుర్తిస్తారు. ఈ వ్యాధి సోకిన రొయ్యల్లో మేత తీసుకోవటం తగ్గి, పెరుగుదల నిలిచిపోతుంది. పంట కాలంలో ఒకసారి ఈ వ్యాధి సోకితే దాదాపు 20 నుంచి 30 రోజుల వరకు పంటకాలం ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆ సమయంలో నియంత్రణ కోసం చేపట్టే యాజమాన్య పద్ధతుల కోసం రైతులు అదనపు ఖర్చులు పెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యాధికి వేగంగా వ్యాప్తి చెందే లక్షణం ఉండడంతో ఆరోగ్యకరమైన రొయ్యలు కూడా వ్యాధి బారిన పడుతున్నాయి.

వాతావరణ మార్పులతో పెరిగిన ఉధృతి

వైట్‌గట్ వ్యాధికి కారణాలు సాంకేతికంగా అనేక రకాలుగా ఉన్నా జిల్లాలో కనిపిస్తున్న వాతావరణ మార్పులతో వ్యాధి ఉధృతి పెరిగింది. వాతావరణంలో తేమశాతం పెరగటంతోపాటు, పగటి ఉష్ణోగ్రతల్లో సమతుల్యత లోపించటంతో వ్యాధి వ్యాప్తి చెందుతోంది. దీనికి తోడు బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్, గట్ మైక్రోబయోమ్ డైస్బియోసిస్, నాసిరకమైన మేతలు కూడా కారణమవుతున్నాయి.



మత్స్యసాగుబడికి మంగళం

గత ప్రభుత్వంలో వైఎస్సార్ మత్స్యసాగుబడి పథకం ద్వారా ప్రతి వారం ఆక్వా రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు కలిగించేవారు. ముందస్తు వ్యాధి గుర్తింపు, ఆధునిక యాజమాన్య పద్ధతులపై రైతులను చైతన్యపరిచేందుకు అవకాశం ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పథకానికి మంగళం పాడేశారు. స్థానికంగా సచివాలయాల్లో ఉన్న ఫిషరీస్ అసిస్టెంట్‌తో సలహాలు, సూచనలు ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

ముందస్తు విధానాలతోనే నియంత్రణ



వైట్ గట్ వ్యాధి రాకుండా ముందస్తు విధానాలు పాటించటం మంచిది. పరీక్షించిన విత్తనం, నీటి నాణ్యత, ఉత్తమ ఫీడింగ్ నిర్వహణ తదితర అంశాలు రొయ్యల్లో వైట్‌గట్ నియంత్రణకు దోహదపడతాయి. ఇటీవల మార్కెట్లో ప్రత్యేకంగా గట్ మైక్రోబయోమ్‌ను పునరుద్ధరించడానికి ప్రొబయోటిక్స్ కూడా లభిస్తున్నాయి.

– జి.విద్యాధర్, ఆక్వా టెక్నీషియన్

ఈ కాలంలోనే ఎక్కువ వ్యాప్తి



రొయ్యల్లో వైట్‌గట్ సమస్యతో చాలా ఇబ్బంది పడాల్సివస్తోంది. ముఖ్యంగా వర్షాకాలంలో వ్యాధి వ్యాప్తి ఎక్కువ. రైతుల్లో కూడా దీనిపై అనేక అపోహలు ఉన్నాయి.

– సింగుపురపు జగదీష్, ఆక్వారైతు, సుసరాం

ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం

- ఎరువుల పంపిణీలో ప్రభుత్వం విఫలం
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల కష్టాలు పెరిగాయని, ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఎరువులకు కొరత ఏర్పడితే వ్యవసాయ శాఖ మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మొదటి విడతకే పరిస్థితి ఇలా ఉంటే రెండో విడత ఎరువులు పంపిణీ ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక యూరియా బస్తా కోసం రైతులు నానా అగచాట్లు పడుతున్నారని, కూటమి ప్రభుత్వానికి సిగ్గు ఉందా అని మండిపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి ఆర్‌బీకేలో అవసరం మేరకు ఎరువులు ముందుగానే సిద్ధం చేసేవారమని గుర్తు చేశారు. ఇప్పుడు పరిస్థితి తారుమారైందని అన్నారు. రైతుల పట్ల ఇంత కక్ష కట్టిన ప్రభుత్వం గతంలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. ఎన్నికల ముందు రైతులకు పెట్టుబడి కింద రూ.20 వేలు ఇస్తామని ప్రకటన చేశారని, ఒక ఏడాది ఎగ్గొట్టేశారని, ఈ ఏడాది కూడా కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు ఇదివరకు ఉన్న ఉచిత బీమా పథకాన్ని ఎత్తేయడం దారుణమన్నారు. దీంతో జిల్లా రైతులపై రూ. 5 కోట్లు వరకూ భారం పడిందని అన్నారు. గత ఖరీఫ్‌లో దిగుబడి అయిన ధాన్యంలో సగానికి పైగా ధాన్యాన్ని కొనకుండా రైతులకు మొండి చేయి చూపారని విమర్శించారు. ఆర్‌బీకేలను కూడా నిర్వీర్యం చేశారని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ నాయకులు చింతు రామారావు, కనిత కృష్ణారావు, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ గ్రామానికి ఏమైంది?



- టి.డి.వలసను కుదిపేస్తున్న జ్వరాలు
- కాళ్లపొంగులు, కీళ్లనొప్పులతో గ్రామస్తుల అవస్థలు

జి.సిగడాం :

టంకాల దిగ్గువలస గ్రామంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. నెల రోజులుగా గ్రామంలో ఏ ఇంట చూసినా జ్వర పీడితులే కనిపిస్తున్నాయి. ఇంట్లో ఒకరికి తగ్గితే వెంటనే మరొకరు మంచంపడుతున్నారు. మూడు నుంచి ఐదు రోజుల తర్వాత దురదలువచ్చి కాళ్ల పొంగులు, కీళ్ల నొప్పులు బాధిస్తున్నాయని జ్వరపీడితులు చెబుతున్నారు. స్థానిక వైద్యాధికారులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినా ఫలితం ఉండటం లేదు. ఇప్పటికే తాగునీటి బోర్లు, బావుల్లో నీటిని పరీక్ష చేయించారు., ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతున్నారు. మరోవైపు దోమల నివారణ మందులను ఫాగింగ్ చేయిస్తున్నారు. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.



ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఆందోళనగా ఉంది..



జ్వరం రావడంతో వైద్యసిబ్బంది వచ్చి పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. జ్వరం తగ్గాక కాళ్ల నొప్పులు, కాళ్లపొంగులు వచ్చాయి. నెల రోజులుగా నరకయాతనపడుతున్నాం. – గిడిజాల శ్రీరాములు, టి.డి.వలస, జి.సిగడాం మండలం

మళ్లీ జ్వరం..



వారం రోజుల క్రితం జ్వరం వచ్చి తగ్గిపోయింది. మళ్లీ జ్వరం రావడంతో పాటు కాళ్లనొప్పులు, పొంగులు ప్రారంభమయ్యాయి. నడవడానికి కూడా ఇబ్బందిగా ఉంటోంది.– టంకాల భాస్కరరావు, టి.డి.వలస

ప్రతిరోజూ వైద్యసేవలు



టి.డి.వలసలో నెల రోజులుగా ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. రోగుల ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నాం. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం.

– బుడుమూరు యశ్వంత్, వైద్యాధికారి, జి.సిగడాం

27 వరకు వర్షాలు: కలెక్టర్



శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలకు అవకాశం ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ స్థితిగతులపై రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ జారీ చేసిన ప్రత్యేక బులెటిన్‌ను ఆయన జిల్లా అధికారులకు చేరవేస్తూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ నెల 24 నుంచి 27 వరకు తేలికపాటి నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, ముఖ్యంగా 24, 25 తేదీల్లో కొద్దిచోట్ల అతి భారీ వర్షాలు నమోదు కావచ్చని చెప్పారు. ఇప్పటికే సముద్రంలో గాలుల వేగం గంటకు 65 కిలోమీటర్ల వరకు పెరిగే అవకాశం ఉండటంతో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకూడదని హెచ్చరించారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం కవిటి వర కూ తీరంలో 3.0 నుంచి 3.8 మీటర్ల వరకూ అలలు ఎగసిపడే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తాత్కాలిక బస కేంద్రాలు సిద్ధం చేయాలని సంబంధిత తహసీల్దార్లకు సూచించారు. ప్రతి మండలంలో రెవెన్యూ, పోలీస్, రవాణా, విద్యుత్తు, ఆరోగ్య శాఖల సమన్వయంతో నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పాతపట్నం, కొత్తూ రు, ఇచ్ఛాపురం, కవిటి, నందిగాం, సంతబొమ్మాళి, గార మండలాల్లో అత్యవసర పరిస్థితులకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

అవసరమైతే ఎమర్జెన్సీ నంబర్లు

విపత్తుల సందర్భంలో స్పందన కోసం రాష్ట్ర ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ ద్వారా 112, 1070, 18004250101 నంబర్లకు లేదా soec apsdma@ap.gov.in మెయిల్‌కు సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగం సూచనలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విజ్ఞప్తి చేశారు.

ఎందుకంత నీరుత్సాహం!



- మూడు జిల్లాల సాగునీటి ప్రాజెక్టులకు ఎస్‌ఈగా ఒకే అధికారి
- జలవనరుల శాఖలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- ముగ్గురితోనే గొట్టా బ్యారేజీ నిర్వహణ

హిరమండలం: జల వనరుల శాఖలో 'నీరు'త్సాహం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యంలో ఒకే అధికారి ఎస్‌ఈగా విధులు నిర్వహిస్తున్నారు. లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేసే వంశధార ప్రాజెక్టులో ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకూ ఉద్యోగుల కొరత వెంటాడుతోంది. దీంతో ఇది ప్రాజెక్టులు, కాలువల నిర్వహణపై ప్రభావం చూపుతోంది. ఏళ్ల తరబడి ఇక్కడి పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీంతో ఏటా ఖరీఫ్, రబీలో సాగునీటి విడుదల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

అరు డివిజన్లకు ఇద్దరే ఈఈలు

వంశధార ప్రాజెక్టుకు సంబంధించి ప్రధానమైనది గొట్టా బ్యారేజీ. దీని పరిధిలోని కుడి, ఎడమ ప్రధాన కాలువలు, ఎత్తిపోతల పథకాలు, వంశధార ఫేజ్-2 రిజర్వాయర్, వంశధార-నాగావళి అనుసంధాన కాలువలు ఉన్నాయి. వీటి నిర్వహణ ఒకరిద్దరితో కాదు. అన్ని విభాగాల్లో అధికారులు, సిబ్బంది ఉంటేనే సాధ్యమవుతుంది. కానీ ఎక్కడా పూర్తిస్థాయిలో అధికారులు, సిబ్బంది లేకపోవడం లోటుగా మారింది. ప్రస్తుతం వంశధార ప్రాజెక్టు పరిధిలో నరసన్నపేట, టెక్కలి, ఆమదాలవలస-1, ఆమదాలవలస, శ్రీకాకుళం, హిరమండలం డివిజన్లు ఉన్నాయి. ప్రాజెక్టు కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో ముందుకు తీసుకెళ్లడంలో ఈఈల పాత్ర కీలకం. ఒక్క ఆమదాలవలసలోని రెండు డివిజన్లకు మాత్రమే ఈఈలు ఉన్నారు. మిగతా నాలుగుచోట్ల పూర్తిగా లేరు. ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. అందుకే ప్రాజెక్టుల కార్యకలాపాలతో పాటు క్షేత్రస్థాయిలో నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అటు ఏఈలతో పాటు ఏఈఈలు కూడా తక్కువ మందే ఉన్నారు. ఏఈలు 13 మందికిగాను ఐదుగురు, ఏఈఈలు 58 మందికిగాను 36 మంది ఉన్నారు. దీంతో అన్నీతామై వారే వ్యవహరించాల్సి వస్తోంది.

గొట్టాకు తప్పని కష్టాలు

- గొట్టా బ్యారేజీ నిర్వహణ కూడా కష్టం అవుతోంది. సిబ్బంది కొరత వెంటాడుతోంది.
- గతంలో బ్యారేజీ నిర్వహణకు సంబంధించి 22 మంది ఉద్యోగులు పనిచేసేవారు.
- వర్క్ ఇన్‌స్పెక్టర్లు ముగ్గురుండాలి కానీ ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు.
- హెల్పర్లు ఆరుగురు ఉండాలి కానీ ఇద్దరున్నారు. మేన్ మజ్దూర్లు 8 మంది ఉండాలి, కనీసం ఒక్కరూ లేరు.
- ఆపరేటర్లు ముగ్గురుండాలి కానీ ఒక్కరు కూడా లేరు. ఎలక్ట్రీషియన్లు ఇద్దరుండాలి.. ఒక్కరూ లేరు. ఏఈలు నలుగురు ఉండాలి.. ఇద్దరు ఉన్నారు. లస్కర్లు పూర్తిగా లేరు.
- సిబ్బంది కొరత కారణంగా నీటి స్థిరీకరణ, నీటి విడుదల, గేట్లు ఎత్తినప్పుడు, అత్యవసర సమయాల్లో ఉన్న ముగ్గురిపై భారం పడుతోంది.

ఇన్‌చార్జి ఎస్‌ఈ దిక్కు..

ఏ సాగునీటి ప్రాజెక్టుకు అయినా సూపరింటెండెంట్ అధికారి (ఎస్‌ఈ) కీలకం. కానీ వంశధార ప్రాజెక్టుకు ప్రస్తుతం ఎస్‌ఈ లేరు. గత ఆరేళ్లుగా ఇక్కడ ఇన్‌చార్జే కొనసాగుతున్నారు. వారు కూడా ఎప్పుడు ఉంటారో? ఎప్పుడు ఉండరో? తెలియని పరిస్థితి. రెగ్యులర్ అధికారి పదవీ విరమణ చేయడంతో అప్పటి నుంచి ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. దీంతో ప్రాజెక్టుల పర్యవేక్షణ, నిర్వహణపై ఆ ప్రభావం కనిపిస్తోంది. ఇంత జరుగుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

సిబ్బంది కొరత వాస్తవమే..



వంశధార ప్రాజెక్టుతో పాటు గొట్టా బ్యారేజీకి సంబంధించి సిబ్బంది కొరత వాస్తవమే. అయినా సరే ఉన్న సిబ్బందితో పనులు చేయిస్తున్నాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నాం. సిబ్బందికి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ప్రభుత్వం తప్పకుండా సానుకూల నిర్ణయం తీసుకుంటుంది.

– ఎం.మురళీమోహన్, వంశధార ఈఈ, నరసన్నపేట డివిజన్



వంశధార గొట్టాబ్యారేజీ

రోడ్డుపై గోతులు పూడ్చిన ఆటో కార్మికులు

ఇచ్ఛాపురం టౌన్ : మున్సిపాలిటీలోని పాతబస్టాండ్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గోతులను ఆటో కార్మికులు గురువారం పూడ్చారు. పట్టణంలో స్వేచ్ఛా వతి అమ్మ వారి సంబరాలు జరిగే సమయంలో గేటు ఏర్పాటు చేసేందుకు రోడ్డుపై గోతులు అలాగే వదిలేశారు. ఆ గోతులు పెద్దవి కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్రంగా ఇబ్బంది కలుగుతోంది. దీంతో ఆటో కార్మికులే ముందుకు వచ్చిన గోతులు పూడ్చారు.



రోడ్డుపై గోతులు పూడ్చుతున్న ఆటో కార్మికులు

ఎరువులపై సమాచారం కోసం కంట్రోల్ రూమ్



ఎరువుల సరఫరాపై కంట్రోల్ రూం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఎరువుల సరఫరా, వినియోగంపై కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు నియంత్రణ విభాగంలో ఈ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాథ స్వామి తెలిపారు. ఎరువుల లభ్యతపై లేదా ఇతర సంబంధిత సమాచారం కోసం రైతులు 9121863788 నంబరుకు సంప్రదించవచ్చన్నారు. ప్రస్తుతం జిల్లాలో సరిపడినంత ఎరువుల నిల్వలు ఉన్నాయని, ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. అవసరానికి మించి ఎరువులను వినియోగించే విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.



● వానలో వాలీబాల్

జిల్లా కేంద్రంలో ఇటీవల పడిన వర్షానికి విశాఖ-ఏ కాలనీ మైదానంలో నీరు చేరింది. అయినా యువకులు ఆగకుండా ఆ వాననీటిలోనే వాలీబాల్ ఆడుతూ కేరింతలు కొట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

క్లుప్తంగా

శాకంబరిగా రాజరాజేశ్వరీ దేవి



రాజరాజేశ్వరీ దేవి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధి ఉమారుద్ర కోటేశ్వర దేవాలయంలో రాజరాజేశ్వరీ అమ్మవారిని ఆషాఢ మాసం, మాస శివ రాత్రిని పురస్కరించుకొని గురువారం శాకంబరిగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఉదయం అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఔట్‌పోస్టు టెండర్లు ఖరారు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అగ్నిమాపక కార్యాలయాల నిర్వహణకు సంబంధించి పొందూరు, మందస ఔట్ పోస్ట్ టెండర్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం తెరిచారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తక్కువ ఉన్న టెండర్లను ఖరారు చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక జిల్లా అధికారి జె.మోహనరావు, అటవీ శాఖ సబ్ డీఎఫ్ఓ నాగేంద్ర, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పద్యకవితా చక్రవర్తి జాషువా




జాషువా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రచయితలు, నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: పద్య కవితా చక్రవర్తి గుర్రం జాషువా అని వక్తలు కొనియాడారు. సాహితీ స్రవంతి, శ్రీకాకుళ సాహితీ ఆధ్వర్యంలో కేంద్ర గ్రంథాలయం సమావేశ మందిరంలో గురువారం జాషువా వర్ధంతి సభ నిర్వహించారు. కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు, ఆకాశవాణి కేంద్రం(విశాఖ) వ్యాఖ్యాత, రచయిత డాక్టర్ బండి సత్యనారాయణ ప్రసంగిస్తూ జాషువా ఆశయాలను, వర్తమాన స్థితిగతుల్ని వివరించారు. ముందుగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కథానిలయం ట్రస్టు కార్యదర్శి దాసరి రామచంద్రరావు, రచయిత చింతాడ తిరుమలరావు, తెలుగు అధ్యాపకులు బాడాన శ్యామలరావు, రచయిత కలమట దాసుబాబు, డాక్టర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం లైబ్రరీ సైన్సు విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ కె.శ్రీనివాసరావు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం సహాయ కార్యదర్శి సుధాకర్, ప్రజా సాహితీ కార్యదర్శి పి.మోహనరావు, యువ రచయితల వేదిక అధ్యక్షులు తంగి ఎర్రమ్మ, సాహితీ స్రవంతి సభ్యులు కె.భుజంగరావు, పి.దివాకర్, ఎస్.రమణారావు, భానుప్రసాద్, కె.ఉదయ్‌కిరణ్, లీలావరప్రసాద్, పొన్నాడ వరాహ నరసింహులు, కవీశ్వర రావు, సిహెచ్ రామచంద్రరావు, సన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

31 మద్యం బాటిళ్లు స్వాధీనం

సారవకోట: మండల కేంద్రం సారవకోటలో వైన్‌షాపు నుంచి 31 మద్యం బాటిళ్లను తరలిస్తున్న కుమ్మరిగుంట గ్రామానికి చెందిన లక్కోజు వెంకటరావును టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బుధవారం రాత్రి పట్టుకున్నారు. అనంతరం సారవకోట పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ గురువారం తెలిపారు.

తప్పిన ప్రాణాపాయం



ఘటనా స్థలంలో లారీ, కారు

రణస్థలం: రణస్థలం కొత్త పెట్రోల్ బంకు సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయం తప్పింది. విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న కారును వెనుకనే వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు మలుపులు తిరుగుతూ లారీ ముందుభాగంలో ఉండిపోయి కొంతదూరం ముందుకు దూసుకొచ్చింది. లారీ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు ఎటువంటి గాయాలు కాలేదు. కారు డ్యామేజ్ అయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

కొలిక్కిరాని కిట్లు లెక్క!





సరుబుజ్జిలి మండలంలోని ఓ పాఠశాలలో పాత యూనిఫాంతోనే హాజరైన విద్యార్థులు

- సుమారు 19 వేల మంది విద్యార్థులకు అందని స్టూడెంట్ కిట్లు
- వివరాలు కోరిన రాష్ట్ర అధికారులు
- సమాచారం లేక చేతులెత్తేసిన సమగ్ర శిక్ష అధికారులు

శ్రీకాకుళం:

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమై 50 రోజులు కావస్తున్నా జిల్లాలో నేటికీ అనేక మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందలేదు. జిల్లాకు సరిపడినన్ని కిట్లు వచ్చినప్పటికీ కొరత ఎందుకు ఏర్పడిందని, తక్షణం పాఠశాలల వారీగా విద్యార్థులకు సరఫరా జరిగిన కిట్లు సంఖ్యను తమ కార్యాలయానికి తెలియజేయాలని రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు జిల్లా అధికారులకు ఆదేశించారు. అయితే ఈ వివరాలను సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు చెప్పలేకపోతున్నారు. పాఠశాలలపై పర్యవేక్షణ జరపాల్సిన సెక్టోరియల్ అధికారుల లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని ఏపీ పాఠశాలలకు బూట్లు, కిట్లు, యూనిఫామ్ ఎన్నెన్ని అవసరమన్నది చెప్పలేని స్థితిలో సమగ్ర శిక్ష ఏపీసీ సిబ్బంది ఉన్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన సీఎంఓ ఉన్నప్పటికీ ఆయనకి సైతం అవగాహన లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎంఈఓలపైనా ఆధారం..

జిల్లాలోని సుమారు 19 వేల మంది విద్యార్థులకు ఇప్పటికీ యూనిఫాం, బూట్లు, నోట్ పుస్తకాలు అందాల్సి ఉంది. ఎవరెవరికీ అవసరమో లెక్కలు తేల్చలేమని నిర్ణయానికి వచ్చిన సమగ్ర శిక్ష అధికారులు మంగళవారం ఎంఈఓలకు ఓ మెసేజ్ పంపించారు. పాఠశాలల వారీగా విద్యార్థులు సరఫరా అయిన కిట్లు సంఖ్యను కార్యాలయానికి తెలియజేయాలని పేర్కొన్నారు. సమగ్ర శిక్ష వద్ద ఉండవలసిన సమాచారాన్ని ఎంఈఓ నుంచి సేకరించాలని ప్రయత్నాలు చేస్తూ ఉండటం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆదేశాలు బేఖాతరు..

సమగ్ర శిక్ష ఏపీసీ రాష్ట్ర జిల్లా అధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా ప్రాజెక్టులోని ఖాళీగా ఉన్న నాలుగు సెక్టోరియల్ పోస్టులకు తక్షణ నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించి సుమారు 20 రోజులు కావస్తున్నా ఇప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏపీసీలతో వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించిన సందర్భంగా రాష్ట్ర అధికారులు సెక్టోరియల్ అధికారుల నియామకానికి సంబంధించిన అంశంపై ఆదేశాలు జారీ చేయగా, జిల్లా కలెక్టర్ సైతం తక్షణం సెక్టోరియల్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది. సెక్టోరియల్ అధికారులు లేకపోవడం వల్ల ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలపై పర్యవేక్షణ లేకుండా పోయింది.

ప్రొటోకాల్ ఉల్లంఘన..

సమగ్ర శిక్ష ఏపీసీ ప్రొటోకాల్ సైతం ఉల్లంఘిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 10న తల్లిదండ్రుల సమావేశం నిర్వహించగా గార ఉన్నత పాఠశాలకు కేంద్రమంత్రి, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్తో పాటు ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖకు సంబంధించిన అధికారులంతా హాజరైనప్పటికీ ఏపీసి మాత్రం అనారోగ్య కారణాలు చెబుతూ గైర్హాజరయ్యారు. ఆరోజు సెలవు పెడుతున్నట్లు చెప్పినప్పటికీ అదే రోజున ఉదయం 10:30 గంటలకు లావేరు మండలంలో జరిగిన పాఠశాల భవన శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావడం గమనార్హం. ఆ రోజున కేంద్ర మంత్రి, జిల్లా అధికారులు హాజరయ్యే కార్యక్రమానికి వెళితే అక్కడ ఏర్పాట్లలో లోటుపాట్లు తలెత్తిన పక్షంలో వారి ఆగ్రహానికి గురవ్వాల్సి వస్తుందన్న భయంతో సెలవు పెట్టారని విద్యాశాఖ వర్గాల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన ఊహించినట్లుగానే గారతో పాటు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్ డేకు చేసిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో విభజన తగదు



నిరసన తెలియజేస్తున్న వామపక్ష నేతలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను ఎవరి ప్రయోజనాల కోసం విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు చేస్తున్నారో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమాధానం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.కృష్ణమూర్తి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం శ్రీకాకుళంలో వామపక్షాలు, ఉద్యోగ, కార్మిక, రైతు, మహిళా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపోను విభజిస్తే అనేక దళిత, పేద హమాలీ కుటుంబాలకు ఉపాధి లేకుండా పోతుందన్నారు. మంత్రి అచ్చెన్నాయుడును జిల్లా ప్రజలు శివారు భూములకు నీరు ఇమ్మని అడుగుతున్నారు తప్ప బీరు అడగడం లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వామపక్ష, వివిధ సంఘాల నాయకులు సీహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, సంతోష్, ఎం.గోవర్ధనరావు, కె.సూరయ్య, ఎల్.రామప్పడు, ఎం.రమణ, పి.సుధాకర్‌బాబు, కేదారేశ్వరరావు, ఆర్.ప్రకాష్, హమాలీ యూనియన్ నాయకులు నిడిగంట్ల రమణ, గజిని శ్రీనివాసరావు, లండ సీతారాం, లింగాల రాము, శొంఠ్యాన శ్రీనివాసరావు, నవిరి సురేష్ పాల్గొన్నారు.

మావోయిస్టు నేతకు మాతృవియోగం



మృతురాలు చినపిల్లమ్మ (ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: బాతుపురం గ్రామానికి చెందిన మావోయిస్టు నేత, కేంద్ర కమిటీ సభ్యులు మెట్టూరు జోగారావు అలియాస్ టెక్ శంకర్ మాతృమూర్తి మెట్టూరు చినపిల్లమ్మ (92) గురువారం మృతి చెందారు. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సాయంత్రం కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. చినపిల్లమ్మకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో మూడో సంతానం జోగారావు. చినపిల్లమ్మ మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆమె అంత్యక్రియలు శుక్రవారం ఉదయం అదే గ్రామంలో చేపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సురేఖా పాణిగ్రాహికి ఘనంగా నివాళి

పలాస: విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి జీవన సహచరిణి సురేఖా పాణిగ్రాహి మృతిపై సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సహాయ కార్యదర్శి వంకల మాధవరావు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. సురేఖా పాణిగ్రాహి బొడ్డపాడులో గురువారం సాయంత్రం 3గంటలకు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలిసిన న్యూడెమొక్రసీ జిల్లా కమిటీ ఓ ప్రకటన విడుదల చేస్తూ ఆమెకు ఘనంగా సంతాపం తెలియజేస్తున్నామని పేర్కొంది. సంప్రదాయ బ్రాహ్మణ కులంలో పుట్టిన సుబ్బారావు పాణిగ్రాహి సురేఖ పాణిగ్రాహిని వివాహం చేసుకుని విప్లవోద్యమ అవసరాల కోసం బొడ్డపాడు చేరుకున్నారని గుర్తు చేశారు. భర్త ప్రజల కోసం గ్రామాల్లో ఉంటే ఆమె భర్తకు చేదోడు వాదోడుగా నిలిచారని తెలిపారు. సురేఖా పాణిగ్రాహి విప్లవ స్ఫూర్తి ఆదర్శ ప్రాయమని తాండ్ర ప్రకాష్ పేర్కొన్నారు.

పచ్చని ఉద్దానాన్ని రాళ్లురప్పలతో పోల్చొద్దు



మాట్లాడుతున్న కమిటీ ప్రతినిధులు

మందస: నిత్యం పంటలతో పచ్చగా కళకళలాడే ఉద్దానాన్ని రాళ్లురప్పలతో కూడిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు భూములతో పోల్చడం సరికాదని కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు అన్నారు. గురువారం మందస మండలం గంగువాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఓ టీవీ చానెల్‌తో మాట్లాడుతూ ఉద్దానాన్ని శంషాబాద్ ప్రాంతంతో పోల్చడాన్ని తీవ్రంగా ఖండించారు. అనంతరం బత్తిన లక్ష్మణ్ మాట్లాడుతూ కొబ్బరి, జీడి, పనస, మామిడి, మునగ, అరటి, జామ, నిమ్మ తదితర పంటలతో కూడిన పచ్చని నేలతల్లిని విడిచి వెళ్లిపోవాలని ఎలా అనగలుగుతున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పొట్టి ధర్మారావు, ఎర్రయ్య, నారాయణ, దున్న హరికృష్ణ, శాంతారావు, శంకర్, చలపతి, సోమేశ్వరరావు, దున్న రామారావు, సంతోష్, శ్యామ్ పాల్గొన్నారు.

ఆరున్నర కేజీల గంజాయితో ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మీసాల చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి బెంగళూరుకు అక్రమంగా గంజాయిని తరలించేందుకు ప్రయత్నించిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఇచ్ఛాపురం సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఇచ్ఛాపురం సర్కిల్ కార్యాలయంలో గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని గంజాం జిల్లా అస్కాకు చెందిన ప్రశాంత్‌కుమార్‌పాఢీ, బెర్హంపూర్‌కు చెందిన కందులు పూర్ణచంద్ర సెనాపతిలు అదే రాష్ట్రంలోని కందమాల్ జిల్లా టికాబలి గ్రామానికి చెందిన బపూని డిఘాల్ వద్ద గంజాయి కొనుగోలు చేశారు. బెంగళూరులోని ఓ వ్యక్తి అందజేసేందుకు బస్సులో ఇచ్ఛాపురం చేరుకున్నారు. అక్కడి నుంచి రైల్వేస్టేషన్‌కి వస్తుండగా ఇచ్ఛాపురం పట్టణ పోలీస్‌లు తనిఖీలు చేపట్టి 6.600 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అరెస్ట్ చేశారు. తనిఖీల్లో పట్టణ ఎస్సై ముకుందరావు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్‌లో మరిన్ని ఆవిష్కరణలు అవసరం

- హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అప్పారావు
- శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'పాపులర్ లెక్చర్ సిరీస్'
- తరలివచ్చిన నిష్ణాతులు, అధ్యాపకులు, విద్యార్థులు



సదస్సులో మాట్లాడుతున్న యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ పి.అప్పారావు

శ్రీకాకుళం న్యూకాలనీ: దేశంలో సైన్స్, సాంకేతిక రంగంలో మరిన్ని ఆవిష్కరణలు జరగాల్సిన అవసరం ఉందని తెలంగాణాలోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ పి.అప్పారావు అభిప్రాయపడ్డారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు అధ్యక్షతన పాపులర్ లెక్చర్ సిరీస్ పేరిట ప్రత్యేక సదస్సు నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ న్యూఢిల్లీ సౌజన్యంతో అప్లైడ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అప్పారావు మాట్లాడుతు సైన్స్‌లో ఆవిష్కృతమయ్యే సరికొత్త వంగడాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని ఆకాంక్షించారు. మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ రాయల సురేష్‌కుమార్, కళాశాల అప్లైడ్ సైన్సెస్(బయోటెక్నాలజీ) విభాగాధిపతి డాక్టర్ మదమంచి ప్రదీప్, జీడీసీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు, గురజాడ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సంయుక్త తదితరులు కార్యక్రమంలో ప్రసంగించి సైన్స్ పరిశోధనలు, విజ్ఞానం, వ్యాధులపై అవగాహన కల్పించారు. పలు అంశాలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి పైడి సుధారాణి, సభ్యురాలు డాక్టర్ రోణంకి హరిత, కె.ప్రశాంతి, కె.అపర్ణ, అధ్యాపకులు, వివిధ కళాశాలల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తం..



క్యాన్సర్ వ్యాప్తి గురించి విద్యార్థులు సమగ్రంగా తెలుసుకోవాలిది. వ్యాధిపై అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. తొలి దశలో క్యాన్సర్ గుర్తింపుతో కొంత నష్టనివారణ చర్యలు తీసుకోవచ్చు. ఏడాదికి కనీసం రెండుసార్లు శారీరక,ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. – ప్రొఫెసర్ రాయల సురేష్‌కుమార్, మద్రాస్ ఐఐటీ

సైన్స్‌తోనే జీవితం..



నిత్యజీవితం సైన్స్‌తోనే ముడిపడి ఉంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సైన్స్‌తోపాటు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిశోధలు ఆవిష్కృతం కావాలి. పరిశోధనలతోనే గుర్తింపు లభిస్తుంది. విద్యార్థి దశ నుంచే పరిశోధనా రంగంపై ఆసక్తిను అలవర్చుకోవాలి. – కింతలి సూర్యచంద్రరావు, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

నైపుణ్యం మెరుగు..



సదస్సులు, సెమినార్‌లతో విద్యార్థుల్లో ఆలోచన సరళి, పరిశోధనా నైపుణ్యం మరింత మెండుగా తయారవుతుంది. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఇటువంటి సదస్సులు దోహదపడతాయి. కార్యక్రమం విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు. – డాక్టర్ మదమంచి ప్రదీప్‌కుమార్, బయోటెక్నాలజీ హెచ్‌ఓడీ



● ఒకరికి ఒకరు..!

హిరమండలం మండలం మహాలక్ష్మీపురం కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడేది. కానీ ఈ ఏడాది మాత్రం రెండో తరగతిలో సీహెచ్ శశికాంత్ అనే విద్యార్థి మాత్రమే మిగిలాడు. అతనికి నాగరాజు అనే ఏకోపాధ్యాయుడు విద్యాబోధన చేస్తున్నారు. ఇక్కడి పాఠశాలలోని 3,4,5 తరగతులను పిండ్రువాడ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేశారు. దీంతో వీరిద్దరితోనే బడి నడుస్తోంది. – హిరమండలం

రణస్థలంలో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

రణస్థలం: గంజాయి నియంత్రణ చర్యల్లో భాగంగా గురువారం రణస్థలంలోని వెంకటేశ్వర కాలనీ, జంక్షన్‌లో సమీపంలోని పలు దుకాణాల్లో నార్కొటిక్ డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీలు చేపట్టారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో ఈ సోదాలు నిర్వహించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

రేపు ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సీనియర్స్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు శనివారం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెలలో జరిగే ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్స్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ సమీపంలోని ఆర్అండ్‌బీ బంగ్లా గ్రౌండ్స్‌లో జరిగే ఈ ఎంపికలకు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రెండు పాస్‌ఫొటోలతో హాజరుకావాలన్నారు.

అచ్యుతానందన్ మృతి తీరని లోటు



అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కార్మికులు

రణస్థలం: కార్మిక, కర్షక, పేదల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన మహోన్నత పోరాట యోధుడు కామ్రేడ్ అచ్యుతానందన్ మరణించడం కార్మిక పోరాటాలకు తీరని లోటు అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ అన్నారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్. అచ్యుతానందన్‌కు విప్లవ జోహార్లు అర్పిస్తూ ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలసలోని శ్యాంపిస్టన్ ప్లాంట్–3 పరిశ్రమ వద్ద సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ 102 ఏళ్ల జీవన ప్రయాణంలో 85 ఏళ్ల తన జీవితాన్ని ప్రజలు, కార్మికులు కష్టజీవుల కోసం, నమ్మిన సిద్ధాంతాల కోసం వెచ్చించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎం.అశోక్, ఎల్.నాగరాజు, జె.సురేష్, ఎం.సునీల్, పి.శ్రీను, కృష్ణారావు, ఎస్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ మంత్రికి.. సమస్యల స్వాగతం



అరసవల్లి ఆదిత్యుని ఆలయం

- నేడు శ్రీకూర్మం, అరసవల్లి ఆలయాలకు మంత్రి ఆనం రాక
- ఓవైపు విజిలెన్స్ దాడులు.. మరోవైపు అభివృద్ధి పేరిట విధ్వంసం
- సమస్యలను మొరపెట్టుకోనున్న పలువురు బాధితులు

అరసవల్లి: రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి రానున్నారు. శ్రీకూర్మంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమానికి హాజరై ఆదిత్యున్ని దర్శించుకునే అవకాశాలున్నాయన్న సమాచారంతో అరసవల్లి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. భక్తుల సౌకర్యాలపై ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.వి. ప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయానికి తొలిసారి మంత్రి రానుండడంతో పలు సమస్యలు ఆయనకు స్వాగతం పలకనున్నాయి. ఎన్నడూ లేనంత అభివృద్ధి అంటూ అధికార పార్టీ ప్రకటనలు గుప్పిస్తుంటే.. ఎన్నడూ చూడని అరాచకం, విధ్వంసం అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.100 కోట్లతో ఆలయ అభివృద్ధి అని ఊకదంపుడు ఉపన్యాసాలు చేసి.. ఇప్పుడు ఆ ప్రస్తావనే చర్చల్లోకి రాకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా చాలావరకు పరిష్కరించకుండా వదిలేసిన పలు అంశాలను బాధితులు మంత్రి ఆనం ఎదుట వెల్లగక్కనున్నట్లుగా సమాచారం.

సిబ్బందితో ఇబ్బంది...!

అరసవల్లి ఆదిత్యాలయానికి గత కొన్నేళ్లుగా సిబ్బంది కొరత అతిపెద్ద సమస్యగా మారింది.గత ప్రభుత్వ హయాంలో సుమారు 49 మందిని దినసరి వేతనదారులుగా నియమించి ఆలయ పరిపాలన, భక్తుల సౌకర్యాలు, అన్నదానం, ప్రసాదాలు, పారిశుద్ధ్యం తదితర విభాగాల్లో నియమించారు. దీంతో ఎక్కడా అవస్థలు లేకుండా భక్తుల దర్శనాలు సాగాయి. కూటమి ప్రభుత్వం రాగానే ఆ 49 మందిని తొలగించేసి త్రీమెన్ కమిటీ సూచనల ప్రకారం ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ నియామకానికి ఆదేశించారు. ఇప్పటివరకు దాని ప్రస్తావనే లేకుండా పోయింది.వీరికి ఏప్రిల్ నుంచి జీతాలు నిలుపుదల చేశారు. స్వామి వారి కార్యక్రమాల్లో భజంత్రీలు వాయించే ఆరుగురిలో ముగ్గురు ఇంటిబాట పట్టగా..మరో ముగ్గురు కూడా జీతాలివ్వని కారణంగా వారు కూడా మరికొద్ది రోజుల్లో బయటకు వెళ్లిపోయేందుకు సిద్ధమవుతున్నారు.

దుకాణాలు కూల్చేసి విధ్వంసంగా....

రథసప్తమి రాష్ట్ర పండుగ చేశామంటూ ప్రకటించి ఆలయం ముందు దశాబ్దాలుగా ఉంటున్న దుకాణ సముదాయాలు, అన్నదాన మండపం, సూర్యనమస్కారాల మండపం, ప్రసాదాల తయారీ కేంద్రం, ప్రసాదాల విక్రయాల కౌంటర్లు, మరుగుదొడ్లు, వసతి గదులు, ఇతరత్రా శాశ్వత భవనాలన్నీ కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే కూల్చేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు రూ.లక్షల్లో విరాళాలిచ్చి భక్తుల సౌకర్యానికై భారీగా జింకు రేకు షెడ్లు నిర్మించగా.. వాటిని దాతలకు కనీస సమాచారం ఇవ్వకుండానే కూల్చేయడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. రూ.100 కోట్లతో 'ప్రసాద్' స్కీం అంటూ హడావుడి చేసిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్నాయుడు, అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్.. ఇప్పుడేమీ చెప్పలేక మిన్నకుండిపోతున్నారు. అసలు 'ప్రసాద్' స్కీం నిధులు రావని తెలిసినా బయటకు పొక్కకుండా అడుగులు వేస్తున్నారు.

అక్రమాలపై విజిలెన్స్ దాడులు..ఆదిత్యాలయంలో గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విచారణకు దిగారు. గతంలో ఈవోగా పనిచేసిన చంద్రశేఖర్ హయాంలో రిటైర్డ్ ఈవో జగన్మోహనరావు, మరో జూనియర్ అసిస్టెంట్, ఓ ముగ్గురు దినసరి వేతనదారుల సహాయంతో దొంగ బిల్లుల ద్వారా ఆలయంలో వివిధ రకాలుగా ఖర్చులు చూపించి సుమారు రూ.2.50 కోట్ల వరకు తినేసారని విజిలెన్స్ గుర్తించింది. దీనిపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు చేపట్టాల్సి ఉంది.

మాస్టర్ ప్లానా..అదెక్కడ!

అరసవల్లి ఆదిత్యాలయానికి మాస్టర్ ప్లాన్ అమలు చేస్తున్నామని అప్పట్లో సీఎం చంద్రబాబు 2015లో ఇదే ఆలయంలో కూర్చుని ప్రకటించారు. ఇంద్రపుష్కరిణి అభివృద్ధి, ఆధునిక రూపురేఖలతో ఆలయ ప్రాకారం, మాడవీధుల విస్తరణ తదితర ముఖ్య పనులను నాలుగు ఫేజ్‌ల్లో ప్లాన్ వర్కౌట్ చేయాలని ఆదేశించారు. అయితే అసలు మాస్టర్‌ప్లాన్‌కు అప్పట్లో టీడీపీ ప్రభుత్వం అధికారికంగా ఆమోదించనే లేదు. గతంలో ప్రతిపాదించిన ల్యాండ్ బ్యాంకు, ల్యాండ్ టు ల్యాండ్ అమలుపై స్పష్టత కరువైంది. దీంతో ఆదిత్యాలయ భూములు ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురౌతున్నాయి.